## క్లుప్తంగా

### కల్యాణం.. కమనీయం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: చాతుర్మాస పూజల్లో వెంకటాద్రిపై శనివారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. శ్రీదేవి,భూదేవి సమేతంగా వెంకన్న ఉత్సవమూర్తులను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

### భక్తులకు రుచికరమైన భోజనం అందించాలి


భోజనం చేస్తున్న భక్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

సింహాచలం: సింహగిరికి వచ్చే భక్తులకు మరింత రుచికరమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దేవస్థానం అధికారులకు సూచించారు. సింహగిరిపై అన్న ప్రసాద భవనాన్ని శనివారం ఆయన పరిశీలించారు. భోజనం చేస్తున్న భక్తులతో మాట్లాడారు. వంటశాల, డైనింగ్ హాల్ తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అందిస్తున్న పదార్థాల నాణ్యతను పెంచాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే సాధారణ భక్తులకు అన్నప్రసాద భవనంలో లభించే భోజనమే ప్రధానమని తెలిపారు. వంటశాలతో పాటు డైనింగ్ హాల్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. అలాగే లడ్డూ ప్రసాదం, పులిహోర ప్రసాదాల తయారీని పరిశీలించారు. ఎప్పటికప్పుడు నాణ్యతను పరిశీలించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, అన్నప్రసాద విభాగం సూపరింటిండెంట్ పాలూరి నరసింగరావు, పీఆర్‌వో అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ


చెరువుగట్టుపై మొక్క నాటుతున్న సర్పంచ్ వెంకటరమణ తదితరులు

సబ్బవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బాటజంగాలపాలెం సర్పంచ్ పడాల వెంకటరమణ అన్నారు. మండలంలోని బాటజంగాలపాలెంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా బడిబంద చెరువు గట్టుమీద శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ షేక్ మదీనా,మాజీ చెరువు సంఘం అధ్యక్షుడు వనం సన్యాసిరావు, వార్డు మెంబర్లు,ఉపాధి హామీ వేతనదారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు అమానుషం

మురళీనగర్: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను క్రిస్టియన్ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. దీనిపై వీరు విశాఖ చర్చెస్ ఆఫ్ క్రైస్ట్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం మురళీనగర్ బిర్లా కూడలి నుంచి కప్పరాడ జంక్షన్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథి రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ మాట్లాడుతూ మణిపూర్‌లో మారణ హోమాన్ని ఆపే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేవతి డేవిడ్‌రాజు ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవ మహిళలపై జరిగిన దాడి అమానుషమని, దీనిపై ప్రతి మహిళ నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. మణిపూర్‌లో మానవత్వాన్ని కాపాడాలని క్రైస్తవ సంఘాల ప్రతినిధులంతా దారి పొడవునా నినాదాలు చేశారు. కార్యక్రమంలో చర్చెస్ ఆఫ్ క్రైస్ట్ ఫెలోషిప్ అధ్యక్షుడు డేవిడ్ మాణిక్యాలరావు, కార్యదర్శి శంకర్ దానియేలు, రామరాజు, నవీన్, విక్టర్ రాజు, పలువురు పాస్టర్లు, మహిళలు పాల్గొన్నారు.

# రెచ్చిపోతున్న మట్టి మాఫియా!


పెదముషిడివాడలో పచ్చలబంద చెరువులో అక్రమంగా తవ్వకాలు జరిపిన దృశ్యం


రహదారిని మట్టితో పూడ్చిన అక్రమార్కులు

- పచ్చలబందలో అక్రమ తవ్వకాలు
- ప్రమాదకరంగా గోతులు

పరవాడ: పెదముషిడివాడ గ్రామంలో రెండు నెలలుగా మట్టి మాఫియా రెచ్చిపోతోంది. గ్రామానికి చెందిన మూడు బ్యాచ్‌లు రాత్రిపూట అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడుతూ సొమ్ము చేసుకొంటున్నాయి. స్థానిక జెడ్పీ పాఠశాల ఎదురుగా ఉన్న పచ్చల బంద చెరువు, కొండ బంజర్లను అక్రమార్కులు అడ్డాగా చేసుకొని రాత్రి 11 గంటలు దాటిన తర్వాత మట్టిని తరలించుకుపోతున్నారు. చెరువులు, కొండ బంజర్లలోనే కాకుండా మట్టి, గ్రావెల్ కనబడితే చాలు భారీ యంత్రాలతో తవ్వకాలు జరిపి నక్కవానిపాలెం, లంకెలపాలెం, గండివానిపాలెం తదితర ప్రాంతాల్లోని లేఅవుట్లు, ఇళ్ల పునాదుల ఫిల్లింగులకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. ముందుగా లేఅవుట్, ఇళ్ల యజమానులతో ఒప్పందం కుదుర్చుకొని రాత్రికి రాత్రి మట్టి తవ్వకాలు జరిపి తరలించుకుపోతున్నారు. 12 యూనిట్ల మట్టిని రూ.6 వేల నుంచి రూ.8 వేలకు విక్రయిస్తున్నారు. ఒక్కొక్క ట్రాక్టరు మట్టిని రూ.2 వేలకు విక్రయించి కాసులు కూడబెడుతున్నారు. ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టడం వల్ల చెరువులు ప్రమాదకరంగా మారుతున్నాయి. పెద్ద పెద్ద గుంతల్లో మూగజీవాలు పడినా బయటకు రాలేని పరిస్థితి ఉంది. పచ్చల బంద చెరువు పెద్ద బావిని తలపిస్తోంది.

**అడ్డంకులు పెట్టినా..**

అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టడానికి రెవెన్యూ సిబ్బంది చెరువుకు వెళ్లే రహదారిపై కాలువ తవ్వి అడ్డంకులు సృష్టించినా ఫలితం కనిపించడం లేదు. రాత్రికి రాత్రి కప్పి యథేచ్ఛగా చెరువులో తవ్వకాలు జరిపి మట్టి తరలించుకుపోతున్నారు. రెండు మూడు నెలల్లో పచ్చల బంద చెరువులో లక్షల విలువ చేసే వేలాది లారీల మట్టి తరలిపోయిందంటే మట్టి దొంగలు ఏ విధంగా రెచ్చిపోతున్నారో స్పష్టమవుతోంది.

**చూసీచూడనట్టు..**

అక్రమ మట్టి, గ్రావెల్ తవ్వకాలపై స్థానికుల నుంచి మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు వెళుతున్నా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్తులు కాపాడేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**బాధ్యులపై చర్యలు**



ప్రభుత్వ బంజర్లు, చెరువులు, గెడ్డలు, వాగుల్లో అక్రమంగా మట్టి, గ్రావెల్ తవ్వకాలు జరపడం చట్టరీత్యా నేరం. అనధికార తవ్వకాలకు పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవు. పెదముషిడివాడలో అక్రమ మట్టి తవ్వకాలు అరికట్టడానికి సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. మండలంలో ఎక్కడైనా అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపితే తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం.

– పి.కనకారావు, తహసీల్దారు, పరవాడ

## 'డిజిటల్ లావాదేవీలపై అవగాహన అవసరం'


వెబ్‌నార్‌లో పాల్గొన్న అతిథులు

సబ్బవరం: డిజిటల్, బ్లాక్‌చెయిన్ లావాదేవీలకు సంబంధించి వినియోగదారుల్లో అవగాహన అవసరమని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ డా పి.శ్రీ సుధ అన్నారు. వర్సిటీ ఆధ్వర్యంలో శనివారం డిజిటల్ యుగంలో వినియోగదారుల రక్షణ అంశంపై వెబ్‌నార్ జరిగింది. ఈ సందర్భంగా ఔరంగాబాద్‌లోని మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ కె.వి.ఎస్ శర్మ మాట్లాడుతూ ఆర్థిక లావాదేవీలు నిర్వహించడానికి సహాయపడే యాప్‌ల గురించి వివరించారు. సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ రీసెర్చ్ ప్రకారం డిజిటల్ ప్లాట్‌ఫాంలు అన్ని స్థాయి వ్యక్తులను ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. యాప్‌ల ద్వారా వచ్చే సమస్యలను పరిష్కరించడానికి ఓ వేదిక ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్ఎల్‌యూ రాంచీ ఉప కులపతి అశోక్ ఆర్. పాటిల్ మాట్లాడుతూ ఈ-కామర్స్ సంబంధించి వినియోగదారులకు కోసం 2019లో ఓ చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. వినియోగదారులను తప్పుదారి పట్టించే ప్రకటనల విషయంలో జరిమానా విధించవచ్చన్నారు. వినియోగదారుల నిపుణుడు సురేష్ మిశ్రా మాట్లాడుతూ ఈ-కామర్స్ ప్లాట్‌ఫాంల ద్వారా వినియోగదారుల డేటా దుర్వినియోగం అవుతోందన్నారు. సైబర్ లా నిపుణుడు ప్రశాంత్ మాలి వినియోగదారుల రక్షణ చట్టం అమలులో ఉన్న లోటుపాట్లపై మాట్లాడారు. ప్రొఫెసర్ రాజేంద్ర ప్రసాద్, పి.వి.వి.ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ ప్రమాదంపై సమగ్ర విచారణకు డిమాండ్


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో ఇటీవల జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి దోషులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎన్టీపీసీలో కేబుల్ ట్రాక్ కుప్పకూలి ఇద్దరు కార్మికులు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల మృతదేహాలను గుట్టు చప్పుడు కాకుండా వారి స్వగ్రామాలకు తరలించడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు.

మృతులకు ఎంత నష్టపరిహారం చెల్లిస్తున్నారు.. వారి కుటుంబాలకు ఎలాంటి భరోసా కల్పిస్తారో తెలియజేయకపోవడం దుర్మార్గమన్నారు. గాయపడ్డ కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రొంగలి రాము, వి.వి.శ్రీనివాసరావు, దేముడు పాల్గొన్నారు.

## గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్టు సేవలు అభినందనీయం


అన్నంరెడ్డి అజయ్‌రాజ్‌తో కలిసి మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం: గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్టు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని సబ్బవరం శివాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన లక్ష మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజయ్ రాజ్‌తో కలిసి మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ట్రస్టు నిర్వాహకుడు విజయకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టడం శుభపరిణామం అన్నారు. ట్రస్టు నిర్వాహకుడు విజయకుమార్ మాట్లాడుతూ మొదటి విడతలో సబ్బవరంతో పాటు అంతకాపల్లి,తుని,సాలూరు,ఉప్పాడ,ఏలూరు వంటి ప్రాంతాల్లో ఈ మొక్కలు పంపిణీ చేశామన్నారు. అనంతరం పేదలు, ,వితంతువులకు,వృద్ధులకు నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, సర్పంచ్ దెద్దం ప్రసాదరావు, నాయకులు కొటాన రాము, పాలిశెట్టి సురేష్‌రాజ్, సబ్బవరపు ముత్యాలనాయుడు, బోకం రామునాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి,శరగడం రాము,బైలపూడి దేముడుబాబు,బోను గంగునాయుడు, గొర్లి రాజేష్,టి. శేఖర్,విరోతి రామారావు పాల్గొన్నారు.

## అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఏకాదశి పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జితసేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణతులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. 108 స్వర్ణ తులసీ దళాలతో అర్చన చేశారు. ఆలయ సూపరింటిండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసంహస్వామికి శనివారం గరుడసేవ వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.

## 'సకల కళాకారుల' నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ ప్రతినిధులు

సీతంపేట: విశాఖ సకల కళాకారుల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. సంఘం గౌరవాధ్యక్షుడిగా సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు, అధ్యక్షురాలిగా సినీ కవి జాలాది కుమార్తె జాలాది విజయ, ప్రధాన కార్యదర్శిగా చెన్నా తిరుమలరావు, కార్యదర్శిగా కె.లోకేశ్వరరావు, కోశాధికారిగా మధుపాడ రమణి, ఉప అధ్యక్షుడిగా జె.ఎం.ఆర్ నెహ్రూ, ఉపాధ్యక్షులుగా ఎం.త్రినాథరావు, దండు నాగేశ్వరరావు, అరుణ్ సాయి కుమార్, సహాయ కార్యదర్శులుగా మిమిక్రీ శ్రీనివాస్, కందర్ప రాధ, జి.జగదీష్, నిర్వాహక కార్యదర్శిగా కోరుకొండ రంగారావులతో పాటు మరో 13 మంది సలహాదారులు, ఈసీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. గౌరవాధ్యక్షుడు కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ కళాకారుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. అధ్యక్షురాలు జాలాది విజయ మాట్లాడుతూ నగరంలోని కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్యాలు, ఏకపాత్రాభినయం, సినీ గీతాలు, మిమిక్రీ, డోనాల్డ్ డక్ ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, బొట్టా వేణు, దండు నాగేశ్వరరావు, కొరిటాల ప్రభాకర్, ఎం.వి. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అమరులకు ఘన నివాళి


స్వర్గీయ అనుకుష్‌శర్మ, చందక గోవింద్ స్మారకాల వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

సింధియా: శౌర్య దివస్‌ను పురస్కరించుకుని ఐఎన్ఎస్ కర్ణలోని శౌర్యస్థలం వద్ద తూర్పు నావికాదళం తరపునన కమాండర్ సీఎస్ నాయర్ మార్కోస్ బ్రేవ్ హార్ట్స్‌కు ఘన నివాళులర్పించారు. మార్కోస్ బ్రేవ్ హార్ట్స్ జ్ఞాపకార్థం ఆపరేషనల్ క్యాజువాలిటీగా మారిన శౌర్య స్థలాన్ని సందర్శించిన పలువురు అనుభవజ్ఞులు వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. మార్కోస్ బ్రేవ్ హార్ట్స్‌గా పిలువబడే స్వర్గీయ అనుకుష్‌శర్మ, స్వర్గీయ చందక గోవింద ఇద్దరూ 2023 మధ్యలో విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన వీరులు. వీరి స్మారకాల వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు.

# త్వరలో పంచగ్రామాల సమస్యకు పరిష్కారం

- పవన్ దిగజారుడు వ్యాఖ్యలు మానుకో
- వలంటీర్ల వల్లే ప్రజలకు విశేష సేవలు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్


అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ముత్తంశెట్టి

సింహాచలం: అవినీతికి తావులేకుండా.. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అడవివరంలోని మధ్యవీధి, పోస్టాఫీసువీధి, పాత అడవివరం, కాపు వీధి ప్రాంతాల్లో రూ. 75.25 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, సీసీ కాల్వల పనులకు సంబంధించి శనివారం ముత్తంశెట్టి శంకుస్థాపన చేశారు. పోస్టాఫీసు వీధిలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి అనంతరం అక్కడ జరిగిన సభలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టి ప్రజలకు మేలు చేశారన్నారు. ఆ వ్యవస్థలు ఉండడం వల్లే కరోనా కష్ట కాలంలో కూడా ప్రజల బాగోగులు చూసే అవకాశం కలిగిందన్నారు. కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగే పని లేకుండా చేశారన్నారు. అలాంటి వలంటీర్ వ్యవస్థను జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. వలంటీర్ల వల్లే ఆడపిల్లలు మాయమవుతున్నారని అనడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. మీ ఇంట్లో ఆడ పిల్లలెవరైనా మిస్ అయ్యారా అని పవన్‌ను ప్రశ్నించారు.

**బాధితులకు న్యాయం**

అడవివరం బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ విషయమై మళ్లీ అధికారులతో సమావేశం పెడతామన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చేస్తానని హామీ ఇచ్చారు. సింహాచలం దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచగ్రామాల భూసమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందన్నారు. అలాగే ఇళ్ల మరమ్మతులకు కూడా అవకాశం ఇచ్చేలా చర్యలు చేపడతామన్నారు.

**ఒక వార్డులోనే రూ.110 కోట్ల లబ్ధి**

ఒక్క 98వ వార్డులో మొత్తం 39వేల 500 మంది లబ్ధిదారులకు రూ.110 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా నగదు అందించడం జరిగిందన్నారు. అనంతరం పోస్టాఫీసు వీధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముత్తంశెట్టి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో వారికి అందిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి రావాలని వారికి తెలియజేశారు. కార్యక్రమంలో 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, జీవీఎంసీ 8వజోన్ కమిషనర్ మల్లయ్య నాయుడు, వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, పార్టీ 98వవార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, పార్టీ నాయకులు నడింపల్లి రామరాజు, పీతల అప్పలరాజు, లంక సత్తిబాబు, మజ్జి ధర్మా, మజ్జి ధర్మా, ఎస్.కృష్ణ, దొంతల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

**ముత్తంశెట్టి దృష్టికి వర్తకుల సమస్యలు**

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి సింహగిరి వర్తకుల సమస్యలను నూతన అధ్యక్ష, కార్యదర్శులు మొగ్గ కిరణ్, కర్రి అప్పలస్వామి తీసుకెళ్లారు. వర్తకులకు ఆమోదయోగ్యమైన ప్రదేశంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఇవ్వాలని కోరారు. ముత్తంశెట్టి మాట్లాడుతూ దేవస్థానం అధికారులతో మాట్లాడి వర్తకులకు న్యాయం జరిగేలా చేస్తానని తెలిపారు. వర్తక సంఘం ఉపాధ్యక్షుడు సానబోయిన రాజు, సంయుక్త కార్యదర్శి దొంతల శంకర్, వర్తకులు బంటుబిల్లి సురేష్, అప్పలరెడ్డి శివ తదితరులు ఉన్నారు.

### 'కులాల వారీగా జనగణన అవసరం'

సీతంపేట: దేశంలో కుల గణన జరగకపోవడం వల్ల బీసీ సామాజిక వర్గం చాలా నష్టపోతోందని, దేశంలో 54 శాతం ఉన్న బీసీలకు 27 శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పిస్తున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. 15 శాతం ఉన్న ఓసీలకు మాత్రం 10 శాతం ఈడబ్ల్యూస్ రిజర్వేషన్ కల్పించడం ప్రభుత్వాలకు బీసీలపై ఉన్న చిన్న చూపునకు నిదర్శనమని అభిప్రాయం వ్యక్తం చేశారు. బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం 'జన గణనలో సమగ్ర కులగణన' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సభాధ్యక్షుడు కట్టా మల్లేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో కులాల మధ్య ఏర్పడిన అసమానతలు రూపుమాపాలంటే సమగ్ర కులగణన తప్పనిసరి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే సెన్సస్‌లో సమగ్ర కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏపీ కూడా బీహార్ తరహాలో కులగణన చేపట్టాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, చింతపల్లి రాంబాబు, పెబ్బిలి రవికుమార్, ఈమని చంద్రశేఖర్, ఖాన్, ప్రొఫెసర్ చింతపల్లి కనకారావు, డాక్టర్ జి.వి నూత్న, డాక్టర్ సీతల్, బొంగు రాజారావు, కడలి సుబ్బారావు,శరగడం వెంకటలక్ష్మి, పలువురు బీసీ నాయకులు తమ అభిప్రాయాలు తెలియజేశారు.

## కడుపుమంటతోనే వలంటీర్లపై పవన్ నీచ వ్యాఖ్యలు

కార్పొరేటర్ ముమ్మన




సింహాచలం: వలంటీర్ వ్యవస్థపై కడుపు మంటతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ నీచమైన వ్యాఖ్యలు చేస్తున్నారని, తక్షణమే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు డిమాండ్ చేశారు. సుజాతనగర్‌లో శనివారం వలంటీర్లనుద్దేశించి పవన్ చేసిన వ్యాఖ్యలను ముమ్మన దేముడు ఖండించారు. కరోనా కష్టకాలంలో కూడా ప్రజలకు వలంటీర్లు ఎంతో సేవ చేశారన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ సైతం వలంటీర్ వ్యవస్థను మెచ్చుకున్నారని.. ఇతర రాష్ట్రాల సీఎంలు కూడా వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చే పరిస్థితులు ఉన్నాయన్నారు. సేవా దృక్పథంతో వలంటీర్లు పనిచేస్తున్నారన్న విషయాన్ని పవన్ గ్రహించాలని హితవు పలికారు. వ్యక్తి చేసే తప్పు అతని క్యారెక్టర్‌పై ఆధారపడి ఉంటుందని, వ్యవస్థపై ఆధారపడి ఉండదని పవన్ కల్యాణ్ ముందుగా తెలుసుకోవాలన్నారు. వలంటీర్‌ను నియమించేటప్పుడు అతని క్యారెక్టర్‌తో పాటు పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ తీసుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగైతే ఇంటికి వచ్చి కేబుల్ బిల్ వసూలు చేసే వారితో పాటు గ్యాస్ సిలెండర్ తీసుకొచ్చే వారు కూడా పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ తీసుకోవాలా అని ప్రశ్నించారు. సుజాతనగర్‌లో జరిగిన వృద్ధురాలి వరలక్ష్మిని వలంటీర్ హత్య చేశాడని అనడం సమంజసం కాదన్నారు. అతడి పనితీరు బాగోలేక అప్పటికే విధుల నుంచి తొలగించడం జరిగిందన్నారు. ఆ విషయం కూడా తెలుసుకోవాలన్నారు. వలంటీర్ వ్యవస్థపై అనుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదని, గట్టిగా బుద్ధి చెబుతామన్నారు.

### దిగొచ్చిన టమాటా ధర

సీతమ్మధార: నగరంలోని రైతుబజార్లలో టమాటా ధర తగ్గింది. నెల రోజులుగా కిలో టమాటా బహిరంగ మార్కెట్లో రూ.120 నుంచి రూ.150 వరకు విక్రయించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై రూ.50కు టమాటాలు విక్రయాలు చేపట్టింది. కొద్ది రోజులుగా ధరలు తగుతున్నాయి. శనివారం రైతుబజారులోని సాధారణ స్టాల్‌లో కిలోరూ.60కు విక్రయించారు.



## లారీ ఢీకొని మహిళ మృతి


మృతురాలు షేక్ అస్మతున్నిషా (ఫైల్)

కూర్మన్నపాలెం : స్కూటీని వెనుక నుంచి టిప్పర్ లారీ బలంగా ఢీకొన్న సంఘటనలో ఓ మహిళ మృతి చెందగా, మరో మహిళ తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్న ఘటనపై లా అండ్ ఆర్డర్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. గాజువాక అజీమాబాద్‌కు చెందిన రబియా బేబీ షేక్, అత్త షేక్ అస్మతున్నిషాతో కలిసి స్కూటీపై గాజువాక నుంచి అగనంపూడి ఆస్పత్రికి వెళ్తున్నారు. అగనంపూడి టోల్‌గేటు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న టిప్పర్‌లారీ స్కూటీని బలంగా ఢీకొనడంతో కోడలు రబియా బేబీ షేక్ కు, అత్త షేక్ అస్మతున్నిషా(58)కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యలో షేక్ అస్మతున్నిషా మృతి చెందారు. అపస్మారక స్థితిలో ఉన్న రబియా బేబీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతురాలి భర్త ఖాదర్‌వలీ పోర్టులో వెల్డింగ్ పనులు చేస్తుంటారు. మృతురాలి అన్నయ్య షేక్ అమీర్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, పోలీసులు విచారిస్తున్నారు.

### వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గొల్లసన్నిధి సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నసమారాధన జరిపారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, 7 గంటలకు స్వామికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.